కళింగదళ్ నీటి విడుదల

మందస: వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రం సస్యశ్యామలంగా మారుతోందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుడారిసింగి పంచాయతీలోని కురడాలు వద్ద గల కళింగదళ్ జలాశయం గేట్లను శనివారం ఎత్తి, నీటిని విడుదల చేశారు. అనంతరం రైతులు, ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక రైతులకు అన్ని విధాలా న్యాయం జరుగుతోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పూర్తి స్థాయిలో లబ్ధి చేకూరుతోందని, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుతున్నాయని తెలిపారు. రైతులకు సాగునీరు అందించే క్రమంలో రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టామన్నారు. గత పాలకుల హయాంలో అన్నదాత నిర్లక్ష్యానికి గురయ్యాడని, ఇప్పటికీ అది శాపంగానే మారిందన్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెంచుకోగలిగితే రైతులకు మరింత ఉపయోగం చేకూరుతుందన్నారు. సర్పంచ్ సురేష్‌కుమార్‌పాణిగ్రాహి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, ఎంపీటీసీ సీర లోకనాథం, సచివాలయం కన్వీనర్ చింతాడ గణపతి, మందస టౌన్ అధ్యక్షుడు సిందిరి జగన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సవర బాలకృష్ణ, కర్రి గోపాలకృష్ణ, త్రినాథ్‌చౌదరి, ప్రసన్నచౌదరి, తమిరియా శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


కళింగదళ్ జలాశయం నీరు విడుదల చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

గ్రామీణుల చెంతకే మెరుగైన వైద్యం

- దువ్వాడ వాణి

టెక్కలి: వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందుతోందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని లింగాలవలసలో కొత్తగా మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకు మండలానికి కేవలం ఒకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేదని, ఇప్పుడు మరో కేంద్రం మంజూరవ్వడంతో సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతానికి తాత్కాలిక భవనంలో ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహించి, మరి కొద్దిరోజుల్లో కొత్త భవనం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. లింగాలవలసలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు వలన ఈ ప్రాంతంలో గిరిజనులతో పాటు ఎంతోమంది గ్రామీణులకు నిరంతరం నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటి వద్దకే వైద్యాన్ని అందజేస్తున్నారని, అలాగే ప్రతీ గ్రామ సచివాలయానికి అనుబంధంగా వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో బి.మీనాక్షి, ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ, సర్పంచ్ సంపతిరావు లక్ష్మి, మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మీతులసీ, వైస్ సర్పంచ్ ఎస్.ఉమాపతి, వైద్య సిబ్బంది సాయిపవన్, భాగ్యశ్రీ, గాయత్రీ, ఇంద్రజ, కె.సురేష్‌కుమార్, జ్యోతి, నాయకులు ఆర్.శ్రీనివాస్, కె.రాములు, జి.కమలాకర్, ఆర్.లక్ష్మీనారాయణ, టి.రమేష్, డి.నరేష్, ఆర్.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న దువ్వాడ వాణి తదితరులు

క్లుప్తంగా

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

పలాస: గ్రామాల్లో వీఏఓలు అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని స్త్రీ నిధి జిల్లా మేనేజరు శ్రీధర్ చెప్పారు. పలాస మండల మహిళా సమాఖ్య భవనంలో శనివారం రెండో రోజు వీఏఓలకు, ఆర్గనైజర్లకు ఆర్థిక నిర్వహణ గురించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్‌తో పాటు ఏరియా కోఆర్డినేటర్ కె.మోహన్‌రావు మాట్లాడుతూ మహిళా స్వయంశక్తి సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలు ఆర్థిక నిర్వహణ పాలసీ ప్రకారం పుస్తక నిర్వహణ సక్రమంగా నిర్వహించుకోవాలన్నారు. స్వయంశక్తి సంఘాలు ఈ ఏడాది నుంచి రూ.200లు చొప్పున పొదుపు చేసుకోవాలన్నారు. గ్రామ సంఘానికి రూ.200లు, మండల సంఘానికి రూ.500లు చొప్పున కట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం బి.మల్లేశ్వరరావు, ఎల్‌సీ సాహు, 20మంది గ్రామ సంఘాల అధ్యక్షులు, 25 మంది వీపీఓలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి, కోశాధికారి వరలక్ష్మి, సీసీలు వెంకటరమణ, నాగమ్మ, రేణుక, కల్యాణి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ఇచ్ఛాపురం రూరల్: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కె.శాసనాం, కొత్తూరీ, మండపల్లి పంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కారంగి త్రినాథ్ రెడ్డి, దుక్క ధనలక్ష్మి, పిట్ట శశిరేఖ, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, పిట్ట మామయ్య, ఉప్పాడ రాజారెడ్డి, రంగాల కృష్ణారెడ్డి, ఏపీఎం పి.శ్రీనివాసరావు, ఎఫ్ఏ లక్కోజీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక పతంజలి యోగా సమితి ఆవరణలో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమం పతంజలి యోగా సమితి ప్రతినిధుల చేపట్టారు. యోగా సమితి గురువు సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో వనమూలికల దినోత్సవం పురస్కరించుకొని ఔషధ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా భారతీయ సాంప్రదాయాలను చిన్నారులకు తెలియజేశారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

వజ్రపుకొత్తూరు రూరల్: మూగ జీవాలకు సంక్రమించే వ్యాధులపై పశు పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి గుంట దేవేంద్రరావు సూచించారు. మండలంలోని బైపల్లి గ్రామంలో పశువైద్య శిబిరం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 140 పశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. అనంతరం అయన మాట్లాడుతూ వ్యాధులపై పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలని, అలాగే మూగ జీవాలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు డొంక విద్యాసాగర్, సిబ్బంది పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

వజ్రపుకొత్తూరు రూరల్: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని గరుడభద్ర సర్పంచ్ గూడ గిరిజ, రాజాం సర్పంచ్ పిట్ట గీతారాణి అన్నారు. గరుడభద్ర గ్రామ సచివాలయంలో జేఎల్‌ఎంగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఎ.శ్రీనివాస్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిట్ట సుగుణ, ఉప సర్పంచ్ ఎం.పార్వతి, సచివాలయ కన్వీనర్ ఎ.దానేష్, పార్టీ నాయకులు గూడ ఈశ్వరరావు, వై.అనందరావు, జి.నగేష్, పి.మురళి పాల్గొన్నారు.

హోంశాఖలోనే కొనసాగించాలని వినతి

కవిటి: తమను హోంశాఖలోనే కొనసాగించాలని గ్రామ సచివాలయాల మహిళా పోలీసులు కోరారు. ఈ మేరకు కవిటి మండలం బల్లిపుట్టుగలో వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ నివాసంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును శనివారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వారితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

టెక్కలి రూరల్: స్థానిక సుదర్శన్ థియేటర్ సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టెక్కలి ఎస్‌ఐ-2 రమేష్ బాబు తన సిబ్బందితో కలిసి శనివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పేకాట శిబిరంపై దాడిచేసి అక్కడ పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.18,480 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు.

రాగి జావతో సంపూర్ణ ఆరోగ్యం

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న గోరుముద్దలో భాగంగా అందిస్తున్న రాగి జావతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సర్పంచ్ పిట్ట శశిరేఖ అన్నారు. మండలంలోని మండపల్లి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఆమె పర్యవేక్షించారు. ప్రతిరోజూ తప్పనిసరిగా మెనూ అమలు చేయాలని సూచించారు. ఆమెతో పిట్ట మామయ్య తదితరులు ఉన్నారు.

ఆక్రమణ కాదు.. అభివృద్ధి పనులు

- వైఎస్సార్‌సీపీ నాయకుల వెల్లడి

మందస: మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లొహరిబందలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వీటిలో ఎటువంటి ఆక్రమణలు జరగలేదని సర్పంచ్ రాపాక జానకమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి రాపాక శేషగిరి, గ్రామ అధ్యక్షుడు కొల్లి తేజేశ్వరరావులు స్పష్టం చేశారు. లొహరిబంద గ్రామ శివారు ప్రాంతంలో శనివారం వారు పర్యటించి, అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాభివృద్ధికి వినియోగించనున్న స్థలంపై ఫిర్యాదులు చేయడం సరికాదన్నారు. తమ అభివృద్ధి పనులతో ఏ గ్రామానికీ నష్టం రాకుండా చూస్తామని, రహదారి కూడా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామకంఠం భూమిలో లైబ్రరీ, జిమ్ నిర్మిస్తామన్నారు. సుమారు 500 ఏళ్లుగా పూజలందుకుంటున్న కిల్లమ్మ తల్లి ఆలయం శిథిలావస్థకు చేరుకుందని, ఈ ఆలయంతో పాటు కాళికమ్మ, పాతపట్నం అమ్మవారి ఆలయాలన్నీ ఒకే చోట నిర్మిస్తామని వెల్లడించారు. కిల్లమ్మ తల్లి ఆలయంపై ఒక చెట్టు ప్రమాదకరంగా మారిందని, హైస్కూలు సమీపంలోని మరో చెట్టుకు విద్యుత్ తీగల రాపిడితో విద్యార్థులకు ప్రమాదం జరగకూడదనే ఉద్దేశంతో చెట్ల కొమ్మలు తొలగించామన్నారు. గ్రామ అవసరాలకు అనుగుణంగానే ప్రజలు నడుచుకుంటున్నారని తెలిపారు. వారితో పాటు పేరెంట్స్ కమిటీ చైర్మన్ అందాల అప్పారావు, సచివాలయం కన్వీనర్ బద్రి కూర్మారావు, బద్రి పోలయ్య, గృహసారథి తాళ్ల జానకిరావు, వార్డు మెంబర్లు గొరకల పాపారావు, నక్క వాసు ఉన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

బాలిగాం పీఏసీఎస్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న చైర్మన్ ఢిల్లేశ్వరరావు తదితరులు

మందస: మండలంలోని బాలిగాం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి అవార్డు దక్కింది. రుణాలు మంజూరు చేయడం, రికవరీ, ఎస్‌టీఓటీహెచ్‌ఈఆర్ఎస్ రుణాలు, ధాన్యం బిజినెస్, పంట రుణాలు రైతులకు అందించడంలో ముందున్న ఈ సంఘానికి ప్రభుత్వం అవార్డు, ప్రశంసాపత్రం, రూ.40 వేలు నగదు బహుమతి అందజేసింది. ఈ మేరకు విజయవాడలో బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సార్ర ఢిల్లేశ్వరరావు, సీఈవో రాళ్లపేట పార్వతీశంలు అవార్డును వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మంత్రి జోగి రమేష్, ఆప్కాబ్ చైర్మన్ ఝాన్సీల చేతులమీదుగా అందుకున్నారు.

శతశాతం సర్వే పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఆర్డీవో సీతారామమూర్తి

వజ్రపుకొత్తూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో ఇంటింటా చేపడుతున్న ఓటర్ల సర్వే ఈనెల 21 నాటికి శతశాతం పూర్తి చేయాలని పలాస ఆర్డీవో టి.సీతారామమూర్తి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి అధ్యక్షతన బీఎల్‌వోలతో సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపై దిశా నిర్దేశం చేశారు. జీరో ఇంటి నంబర్ ఉన్న ఓట్లను గుర్తించి వాటిని సరిచేయడం, రెండు చోట్ల ఉన్న, మరణించిన ఓటర్లను గుర్తించి వాటిని తొలగించే చర్యలు చేపట్టాలని సూచించారు. సర్వేకు వెళ్లినపుడు గ్రామ ప్రజలు, స్థానిక రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఖచ్చితంగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వాయిలపల్లి గిరిరాజ్, ఎన్నికల ఉప తహసీల్దార్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయనశాస్త్రం అధ్యాపకుడు డాక్టర్ బి.సతీష్‌కుమార్ రచించిన 'సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ' పుస్తకాన్ని శనివారం విశాఖపట్నంలో ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- ఎంపీపీ కడియాల పద్మ
- సజావుగా సర్వసభ్య సమావేశం

కవిటి: మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎంపీపీ కడియాల పద్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖలకు సంబంధించి ఇటీవల కాలంలో జరిగిన కార్యక్రమాలపై చర్చించారు. ప్రధానంగా విద్యుత్ శాఖలో ఉద్యోగులు కనీసం ఫోన్లకు స్పందించకపోవడం దారుణమని వైస్ ఎంపీపీ పూడి నేతాజీ వాపోయారు. డబ్బులు ఇచ్చేవారు ఫోన్‌చేస్తే తక్షణమే స్పందిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధినైన తన ఫోన్‌కు బదులివ్వకపోవడానికి కారణమేమిటని విద్యుత్ శాఖ ఇన్‌ఛార్జి ఏఈ నేతాజీని నిలదీశారు. దీనికి వివరణ ఇచ్చేందుకు ఆయన నీళ్లు నమిలారు. అలాగే పీఏసీఎస్ చైర్మన్ దేవరాజ్ సాహూ సైతం విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో ఒక ఎండీయూ ఆపరేటర్ తూకంలో హెచ్చుతగ్గులతో భారీగా చేతివాటానికి పాల్పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కవిటి-1 ఎంపీటీసీ సభ్యుడు పూడి నీలాచలం సభలో ప్రస్తావించారు. దీనిపై సీఎస్‌డీటీ సంతోష్ మాట్లాడుతూ ఇటువంటి అంశాలపై ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, వస్తే ఖచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తహసీల్దార్ పి.శేఖర్, ఎంపీడీవో పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ కడియాల పద్మ

సజావుగా సర్వసభ్య సమావేశం

- వంశధార అధికారుల గైర్హాజరుపై పేరాడ తిలక్ అసహనం

నందిగాం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన ఎంపీడీవో శివప్రసాద్ ఆధ్వర్యంలో సజావుగా మండల పరిషత్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌లో వంశధార నీటి కోసం రైతులు ఎదురుచూస్తుంటే, వారికి భరోసా కల్పించాల్సిన అధికారులు కనీసం సమావేశానికి హాజరవ్వకపోవడంతో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం ఏపీవో నాగరాజు మాట్లాడుతూ.. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రతీ పంచాయతీలో నా భూమి-నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం అనే కార్యక్రమాలు నిర్వహించాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ప్రతీ పంచాయతీలో శిలాఫలకాలు ఏర్పాటు చేయాలని కోరారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు సిమెంట్ తగినంత అందించడం లేదని పలువురు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో తిలక్ సిబ్బందిని వివరణ అడగగా.. లబ్ధిదారులు సిమెంట్ వద్దు అంటున్నారని తెలిపారు. శివరాంపురం పాఠశాలలో విద్యార్థులు ఉన్నా సిబ్బంది తక్కువగా ఉన్నారని, ఇద్దరు ఉపాధ్యాయుల నియామకం జరిగేలా చూడాలని కోరారు. దీంతో తల్లిదండ్రులతో దరఖాస్తు చేయించి ఇవ్వాలని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్తామని తిలక్ చెప్పారు. బడగాం సర్పంచ్ తురుకుల కోట మాట్లాడుతూ.. సర్వీస్ రహదారి గుండా ఆర్టీసీ బస్సులు రాకుండా బ్రిడ్జి మీదుగా వెళ్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. అలాగే సాగునీటి కోసం పలువురు సభ్యులు అడగగా వివరణ ఇచ్చేందుకు వంశధార సిబ్బంది సమావేశానికి హాజరవ్వకపోవడంతో వారిపై చర్యలకు తీర్మానం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో తహసీల్దార్ ఎంవీ పద్మావతి, జెడ్పీటీసీ పేరాడ భార్గవి, వైస్ ఎంపీపీ రేగల లక్ష్మీకాంతం, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు చిన్ని జోగారావు, దిమిలాడ పీఏసీఎస్ అధ్యక్షుడు బాలక మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

అభివృద్ధి పనులకు పారదర్శకంగా నిధులు

- మండల సర్వసభ్య సమావేశంలో దువ్వాడ వాణి

టెక్కలి: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి పారదర్శకంగా నిధులు కేటాయించడం జరుగుతోందని, ఇంకా ఎక్కడైనా అభివృద్ధి పనులకు నిధులు కావాలన్నా తక్షణమే మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి సంబంధించి మొత్తం రూ.3.60 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఒక్క టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో వివిధ రకాల అభివృద్ధి పనులకు రూ.74 లక్షలు కేటాయించామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సైతం బిల్లులు ఇచ్చి అభివృద్ధి విషయంలో నిజాయితీగా వ్యవహరించామన్నారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ సత్తారు సత్యం, డీఎల్‌డీవో అలివేలు, ఎంపీడీవో రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దువ్వాడ వాణి

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


కోటబొమ్మాళి: కాంతమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీనివాసరావు


నందిగాం: ఆస్పత్రిలో వాసుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉమామహేష్

నందిగాం: మండలంలోని దేవుపురం గ్రామానికి చెందిన అంబటి పెద్దవాసు అనారోగ్యంతో రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో అతడికి ఈనెల మంజూరైన పింఛన్‌ను వలంటీర్ కె.ఉమామహేష్ ఆస్పత్రికి వెళ్లి శనివారం అందజేశారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వలంటీర్‌తో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్ ఖగేష్ ఉన్నారు. వీరికి సర్పంచ్ యర్ర విశ్వశాంతితో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

విజయనగరం వెళ్లి...

కోటబొమ్మాళి: మండలంలోని కన్నేవలస గ్రామానికి పైడి కాంతమ్మ విజయనగరంలో తన కుమారుడి వద్ద ఉంటూ కేన్సర్ వ్యాధికి చికిత్స పొందుతోంది. దీంతో వలంటీర్ పొంద్రేటి శ్రీనివాసరావు శనివారం అక్కడికి వెళ్లి ఈనెల పింఛన్ అందజేశారు. దీంతో వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

గడప గడపకూ సంక్షేమం


సోంపేట: లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న పిరియా విజయ తదితరులు


టెక్కలి: కొత్తమ్మతల్లి వీధిలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న దువ్వాడ వాణి

వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలోని అర్హులైన ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణిలు అన్నారు. సోంపేట, టెక్కలి మండల కేంద్రాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్తంగా...

26 మందికి ఇళ్ల పట్టాలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి 16వ సచివాలయం వద్ద 26 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలు శనివారం అందించారు. మున్సిపాలిటీ 31, 28, 29 వార్డులకు చెందిన నిరుపేదలు సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా, 90 రోజుల్లో పట్టాలు మంజూరయ్యాయని 31వ వార్డు కౌన్సిలర్ జోగి సతీష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తంగుడు కనకరాజు, సంబాళ్ల రమేష్, వెంకట్, బెవర కృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

ధర సగానికి పడిపోవడం దారుణం

కాశీబుగ్గ: జీడి పిక్కల ధర ఒక్కసారిగా సగానికి పడిపోవడం దారుణమని వైద్యుడు డాక్టర్ తెప్పల ఆనందరావు అన్నారు. జీడి రైతు సంఘం ఆధ్వర్యంలో కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద శనివారం ఏర్పాటు చేసిన లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంలో పండే జీడిపంట పేరు ప్రఖ్యాతలు సంపాదించి పెట్టిందని, అటువంటి ఉద్దాన జీడిపంట, జీడి రైతు అధోగతికి చేరుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహన్‌రావు, జీడి రైతు సంఘం అధ్యక్షుడు తెప్పల అజయ్‌కుమార్, అంబటి రామకృష్ణ, కె.సింహాచలం, తెప్పల రాజు, కుత్తుం వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు ఔషధం

పలాస: బిడ్డకు తల్లిపాలు ఔషధంతో సమానమని ఎంపీపీ ఉంగ ప్రవీణ అన్నారు. మండలంలోని మోదుగులపుట్టి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో టెక్కలిపట్నం సర్పంచ్ పాలిన కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ప్లేట్లు పంపిణీ

టెక్కలి: స్థానిక గొల్లవీధి అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు శనివారం పౌష్టికాహారంతో పాటు ప్లేట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఎస్.శంకర్, ఎంపీటీసీ వి.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమృత్ భారత్‌లో పలాస రైల్వేస్టేషన్‌కు స్థానం

కాశీబుగ్గ: అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వేస్టేషన్ల అభివృద్ధికి పలాస రైల్వేస్టేషన్ ఎంపికై ంది. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే ఖుర్దా డివిజన్ పరిధిలో ఉన్న పలాస రైల్వేస్టేషన్ గ్రేడ్-ఏ సంపాదించుకున్న సంగతి తెలిసిందే. తాజాగా రూ.23.85 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేశారని ఉన్నత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమల మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జిల్లా పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో పాటు మరికొంతమంది ముఖ్య జిల్లా నాయకులు హాజరుకానున్నారు.

అవగాహన అవసరం

టెక్కలి: గ్రామైక్య సంఘాల మహిళలకు ఆర్థిక లావాదేవీల నిర్వహణపై అవగాహన అవసరమని డీపీఎం కె.మోహన్‌రావు సూచించారు. మహిళా సంఘాలకు ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్‌పై గత రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. కార్యక్రమంలో ఏపీ శ్రీరాములు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం

వజ్రపుకొత్తూరు: గ్రామంలో ప్రతీ ఇంటా పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలని అమలపాడు సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అన్నారు. గ్రామంలోని సచివాలయం వద్ద 700 తడి, పొడి చెత్త సేకరణ బుట్టలను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కారాడ గిరిబాబు, డి.ఢిల్లీరావు, పి.లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి

ఇచ్ఛాపురం రూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ రాజాన ఈశ్వరప్రసాద్ అన్నారు. హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన రూరల్ ఎస్‌ఐ వి.రమేష్, సిబ్బందితో కలసి స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారిపై అవగాహన కల్పించారు.

ఈ-క్రాప్‌పై అవగాహన కల్పించాలి

సోంపేట: ఖరీఫ్ సీజన్‌లో ఈ-క్రాప్ నమోదుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.జగన్మోహనరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు మండలాల వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కలి వ్యవసాయ సహాయకురాలు ఎల్.యమున 2023 ఈ-క్రాప్ పంట నమోదు విధానములో వచ్చిన మార్పులను విశదీకరించి అవగాహన కల్పించారు. సమావేశంలో వ్యవసాయాధికారులు బి.నర్సింహమూర్తి, బి.ధనుంజయ, టి.భార్గవి పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

పలాస: మండలంలోని అల్లుకోల అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లును శనివారం అందజేశారు. స్థానిక సర్పంచ్ దువ్వాడ వామాక్షి చేతులమీదుగా వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కె.ఢిల్లేశ్వరి, పోలీసు కానిస్టేబుల్ జలజాక్షి, సచివాలయ కన్వీనర్ దువ్వాడ రవి తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 4వ వార్డు అంబుసోలి గ్రామంలో సంపూర్ణ పోషణ కిట్లును వార్డు కౌన్సిలర్ మీసాల సురేష్‌బాబు చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెప్ప పాపారావు, ఉదయపురం ఈశ్వరరావు, బోనెల రవి, మట్టా నాని, పి.గోవింద, పిలక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.